పాలమూరు జిల్లా జడ్చర్ల దవాఖానలో చికిత్స పొందుతున్న దామోదర్

బిల్లు ఆపారని .. ఉపసర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం

- జడ్చర్ల దవాఖానలో చికిత్స
- బీఆర్ఎస్ నేతల బిల్లులు ఆపాలని ఏఈపై ఎమ్మెల్యే సోదరుడు, కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి

నవాబ్‌పేట, జనవరి 6 : చేసిన పనికి బిల్లు మంజూరు కాకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ ఉపసర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం దేవల్లిలో చోటుచేసుకున్నది. దేవల్లికి చెందిన ఉపసర్పంచ్ యశోద భర్త దామోదర్ ఆరు నెలల కిందట గ్రామంలో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టేందుకు రూ.2.14 లక్షలు మంజూరు కాగా అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. అనివార్య కారణాలతో పనిచేయలేదు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాత పనులు చేపట్టడానికి వెళ్తే.. స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డు తగిలారు. ఈ విషయాన్ని మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పనులు చేసుకోవాలని సూచించారు. పనులు పూర్తి చేసి బిల్లు కోసం పంచాయతీరాజ్ ఏఈ రాములును సంప్రదించారు. 'నీ బిల్లు ఆపాలని ఎమ్మెల్యే సోదరుడు దుష్యంత్‌రెడ్డి, గ్రామ కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్‌గౌడ్ ఒత్తిడి తెస్తున్నారు. నేను ఈ బిల్లు చేయలేను' అని ఏఈ తేల్చిచెప్పారు. బిల్లు కోసం జిల్లా అధికారులను కలిసినా స్పందన కరువైంది. మనస్తాపానికి గురైన ఆయన శుక్రవారం రాత్రి జడ్చర్ల-గంగాపూర్ మధ్య క్రిమిసంహారకమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. విషయాన్ని ఆయన తన ఫోన్ స్టేటస్, వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడంతో వైరల్ అయ్యింది. స్థానికులు గుర్తించి అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను జడ్చర్ల ఏరియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతున్న దామోదర్ మీడియాతో మాట్లాడుతూ.. అప్పు చేసి డ్రైనేజీ పనులు పూర్తి చేశానని, బిల్లు రాకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నట్టు చెప్పారు.

రాష్ట్రంలో స్తంభించిన పనులు

- సీడీఎఫ్, ఎస్డీఎఫ్ పనులు నిలిపివేయాలని సర్కారు ఆదేశం
- శాఖల వారీగా వివరాల సేకరణ
- ప్రారంభం కాని పనులు రద్దు!
- బసవేశ్వర, సంగమేశ్వర పథకాలూ రద్దు?

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ సర్వే పనులు (ఫైల్)

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ అభివృద్ధి నిధులు (సీడీఎఫ్), ప్రత్యేక అభివృద్ధి నిధులతో (ఎస్డీఎఫ్) చేపట్టిన పనులను రద్దు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీడీఎఫ్, ఎస్డీఎఫ్ పనులపై దృష్టిపెట్టింది. ఆయా పనులు, పథకాలను నిలిపివేయాలని గత నెల 10న కలెక్టర్లను ఆదేశించింది. పనులు, పథకాలు ఏ దశలో ఉన్నాయో సమగ్ర వివరాలు సేకరించాలని సూచించింది. పనులు ప్రారంభం అయ్యాయా? ప్రారంభమైతే ఎంత శాతం పూర్తయ్యాయి? ఎంత మేర బిల్లులు చెల్లించారు? వంటి సమగ్ర వివరాలతో నివేదిక అందించాలని ఆదేశించింది. ఈ మేరకు శాఖల వారీగా అధికారులు సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ పనుల విలువ రూ.10 వేల కోట్లకుపైగా ఉన్నట్టు సమాచారం. ఇందులో అత్యధికంగా పనులు ఇంకా ప్రారంభం కాలేదని అధికారులు తమ నివేదికల్లో తెలిపారు. దీంతో వీటిపై ఆయా శాఖల ఉన్నతాధికారులు ఇటీవల సమీక్ష నిర్వహించినట్టు తెలిసింది. ఈ పనులను వెంటనే నిలిపివేయాలని ఆదేశించినట్టు సమాచారం. ఇప్పటికే ప్రారంభమైన పనులను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగించవద్దని స్పష్టం చేసినట్టు సమాచారం. వీటితోపాటు ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు సైతం మెజార్టీ బిల్లుల చెల్లింపులు నిలిపివేసినట్టు తెలిసింది. కొత్త ఆర్థిక సంవత్సరం వరకు పెండింగ్ బిల్లుల ఊసెత్తవద్దని కాంట్రాక్టర్లకు అధికారులు తెలిపినట్టు సమాచారం. ఫలితంగా ఆయా పనులు కూడా దాదాపు ఆగిపోయాయి. కొన్ని ప్రాజెక్టుల్లో తూతూమంత్రంగా పనులు కొనసాగుతున్నాయి.

వేలాది పనులు రద్దు?

సీడీఎఫ్, ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టిన పనులు, పథకాల్లో ప్రారంభం కాని పనులను పూర్తిగా రద్దు చేయనున్నట్టు సమాచారం. తద్వారా వేల పనులు ప్రారంభం కాకముందే రద్దు కానున్నట్టు అధికారులు చెప్తున్నారు. ఒక్క పంచాయితీరాజ్‌శాఖలోనే 2,800 పనులు మంజూరైనా, ప్రారంభం కాలేదని అధికార వర్గాలు చెప్తున్నాయి. వీటి విలువ రూ.2,100 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. ఈ పనులన్నీ రద్దు అవుతాయని చెప్తున్నారు. వీటితోపాటు మున్సిపల్, రోడ్లు, భవనాలు, నీటిపారుదల.. ఇలా అనేక శాఖల పరిధిలో చేపట్టిన వేల పనులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తుందని సమాచారం. దీంతో ప్రజల ఏండ్ల పోరాటం తర్వాత మంజూరైన పనులు మొదలు కాకముందే కాలగర్భంలో కలిసిపోనున్నాయి. కొన్ని పనులు ప్రారంభమై 10 శాతం వరకు పూర్తయిన వాటిపైనా అధికారులు సమీక్ష నిర్వహించనున్నట్టు తెలిసింది. వాటిని రద్దు చేస్తే ఎంతమేర నష్టం కలుగుతుందో అంచనా వేసి, నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.

బసవేశ్వర, సంగమేశ్వర పథకాలు రద్దు?

ఉమ్మడి మెదక్ జిల్లాలోని సంగారెడ్డి, అందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో 4.56 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రతిపాదించిన బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వం రద్దు చేయనున్నట్టు సమాచారం. ఈ పనుల విలువ సుమారు రూ.4,430 కోట్లు. ప్రాజెక్టు వ్యయంలో నాబార్డు 80 శాతం నిధులను రుణాల రూపంలో సమకూర్చనుండగా, 20 శాతం నిధులను ప్రభుత్వం వెచ్చించనున్నది. సంగమేశ్వర పథకం కింద సింగూరు జలాశయం కుడి వైపు నుంచి 12 టీఎంసీల నీటిని ఎత్తిపోసి జహీరాబాద్, అందోల్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో 2.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని, బసవేశ్వర పథకం కింద సింగూరు జలాశయం ఎడమవైపు నుంచి 8 టీఎంసీల నీటిని ఎత్తిపోసి నారాయణ్‌ఖేడ్, అందోల్ నియోజకవర్గాల్లో 1.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రతిపాదించారు. భూ సేకరణకు ఏర్పాట్లు కూడా చేశారు. ఇప్పుడీ పథకాలను నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం.

పోలీసు పహారాతో యూరియా పంపిణీ

నిర్మల్ జిల్లాలో యూరియా కొరత ఏర్పడింది. ప్రస్తుతం సాగు చేస్తున్న వరి, మక్క పంటలకు అవసరమైన యూరియా కోసం రైతులు ఎగబడుతున్నారు. శనివారం నిర్మల్ జిల్లా కుంటాలలో పోలీసు పహారా మధ్య యూరియా పంపిణీ చేయడం సర్కారు నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నది. పీఏసీఎస్ గోదాం వద్దకు రెండు యూరియా లారీలు వచ్చినట్టు తెలుసుకున్న నాలుగు గ్రామాల రైతులు దాదాపు 40 మందికిపైగా తరలి వచ్చారు. వారిని అదుపు చేసేందుకు ముందు జాగ్రత్తగా పోలీసులను రంగంలోకి దించాల్సి వచ్చింది. పోలీసు పహారా మధ్యనే యూరియా పంపిణీ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నదంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా యూరియా కొరత లేకుండా చూడాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని రైతులు హెచ్చరిస్తున్నారు. - నిర్మల్, నమస్తే తెలంగాణ

జిల్లాల పునర్విభజనపై కమిషన్

- జిల్లాలు, మండలాల విభజన సరిగ్గా లేదు
- బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త జిల్లాలు, మండలాలు ఏర్పాటుచేసిన విధానంపై పునర్విచారణ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ.. 'తెలంగాణలో 33 జిల్లాల పేర్లు చెప్పలేని పరిస్థితి ఉన్నది. ప్రస్తుతం ఒక జిల్లాలో మూడునాలుగు జడ్పీటీసీలు మాత్రమే ఉన్నాయి. జడ్పీ సమావేశం నిర్వహిస్తే ముఖముఖాలు చూసుకోవటం తప్ప మరేమీ ఉండట్లేదు. ఒక ఎంపీ నియోజకవర్గం పరిధిలో 7 అసెంబ్లీ స్థానాలున్నాయి. అవి కూడా మూడునాలుగు జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. ఆ ఎంపీ ఏదైనా చేయాలంటే ఆ మూడునాలుగు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడాల్సి వస్తున్నది. 33 జిల్లాల పేర్లు గుర్తుపెట్టుకోవటం కూడా కష్టంగా ఉన్నది. జిల్లాలు, మండలాల విభజనపై బడ్జెట్ సమావేశాల్లో చర్చిస్తాం. దీనికోసం సుప్రీంకోర్టు లేదా హైకోర్టు జడ్జితో కమిషన్ వేస్తాం. ప్రజల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకొంటాం' అని తెలిపారు.

లోకం పోకడ

భయంతో స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ మాయమైంది!

ఎమ్మెల్సీలుగా బీసీలకే అవకాశమివ్వాలి

బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్

హైదరాబాద్, జనవరి6 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యేలుగా అవకాశం దక్కని బీసీ నేతలకే ఎమ్మెల్సీలుగా అవకాశం ఇవ్వాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ ఒక ప్రకటనలో కాంగ్రెస్ పార్టీని కోరారు. లేదంటే రాజకీయంగా ఆ పార్టీకి పతనం తప్పదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో రెండు ఎమ్మెల్సీ పదవులకు త్వరలో జరగనున్న ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ బీసీలకే ఇవ్వాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ఎందరో బీసీ నేతలు తమ అవకాశాలను త్యాగం చేశారని గుర్తు చేశారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	13.4°c	32.7°c
రంగారెడ్డి	13.9°c	32.9°c
మెదక్	14.3°c	31.4°c
ఖమ్మం	17.0°c	28.0°c
నల్లగొండ	17.0°c	29.1°c
హైదరాబాద్	17.6°c	29.2°c
వరంగల్	18.0°c	28.0°c
కరీంనగర్	18.0°c	29.0°c
నిజామాబాద్	18.3°c	30.1°c
మహబూబ్‌నగర్	18.5°c	30.4°c

'పాలమూరు' కాల్వల టెండర్లు రద్దు?

- 9 వేల కోట్ల పనులకు గతంలో టెండర్లు
- ఉద్దండాపూర్, కరివెన, వెంకటాద్రి కాల్వల నిర్మాణం
- వాటిని రద్దు చేసే యోచనలో సర్కారు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆయకట్టు సాధించాలని లక్ష్యం
- నీటిపారుదల శాఖపై నేడు సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా కాల్వల నిర్మాణానికి గత ప్రభుత్వం ఖరారు చేసిన టెండర్లను రద్దుచేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. నీటిపారుదల శాఖ అధికారుల నుంచి ఇప్పటికే ఇందుకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం సేకరించినట్టు సమాచారం. నేడు ఆ శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశంలోనే టెండర్ల రద్దు నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. ఇతర ప్రాజెక్టుల పురోగతిని కూడా సమీక్షించి భవిష్యత్తు కార్యాచరణపై, ప్రభుత్వ లక్ష్యాలపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నట్టు సమాచారం. తమ పరిధిలోని పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో హాజరుకావాలని ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులకు సీఎం కార్యాలయం నుంచి సమాచారం అందించారు.

రూ.9 వేల కోట్ల పనులు

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోత పథకంలో భాగంగా తాగు, సాగునీటిని అందించేందుకు ప్రధాన కాలువల నిర్మాణ పనులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది. పనులను 3 నెలల్లో పూర్తిచేయాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించింది. ప్రాజెక్టు పరిధిలో 1,226 గ్రామాలకు తాగునీరు అందించటం, 1,536 చెరువులను నింపడంతో పాటు 12.30 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాల్సి ఉన్నది. అందుకోసం 915 కిలోమీటర్ల పొడవుతో ప్రధాన కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నది. వెంకటాద్రి రిజర్వాయర్ నుంచే ఆయకట్టు ప్రారంభం కానుండగా, సింహభాగం దాదాపు 9 లక్షల ఎకరాల ఆయకట్టు ఉద్దండాపూర్ రిజర్వాయర్ కింద ఉన్నది. అందుకు సంబంధించి కాలువల నిర్మాణానికి 15,515 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, అందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటికే పలు రిజర్వాయర్ల కింద కాలువ పనులను చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానించింది. వెంకటాద్రి (వట్టెం) రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువల నిర్మాణాన్ని చేపట్టాలి. 16.74 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన ఆ రిజర్వాయర్ నుంచి మొత్తం 149 కిలోమీటర్ల పొడవుతో హై లెవల్ కెనాల్‌ను, 28.96 కిలోమీటర్ల పొడవుతో లోవెల్ కెనాల్‌ను నిర్మించాల్సి ఉన్నది. ఆ పనులను మూడు ప్యాకేజీలుగా విభజించి రూ.454.56 కోట్లతో చేపట్టాలని నిర్ణయించి టెండర్లను ఆహ్వానించింది. లో లెవల్ కెనాల్ ద్వారా 16 వేల ఎకరాలకు, హైలెవల్ కెనాల్ ద్వారా 1.17 లక్షల ఎకరాలకు నీరందించాలని నిర్ణయించారు. రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాల్లో 1.33 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతోపాటుగా ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు తాగునీరు కూడా అందాల్సి ఉన్నది. ఉద్దండాపూర్ రిజర్వాయర్ నుంచి 4.6 కిలోమీటర్ల పొడవుతో కుడి కాల్వ-1, 100 కిలోమీటర్ల పొడవుతో కుడికాల్వ- 2, 122 కిలోమీటర్ల పొడవుతో ఎడమ ప్రధాన కాల్వ, 90 కిలోమీటర్ల పొడవుతో మద్దూర్ కాల్వ, 24 కిలోమీటర్ల పొడవుతో హన్వాడ కాల్వ నిర్మించాలని నిర్ణయించారు. అందుకు సంబంధించి అధికారులు ఇప్పటికే సుమారు రూ.5,600 కోట్ల విలువైన పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందులో రిజర్వాయర్ నుంచి 122 కిలోమీటర్ల పొడవుతో వికారాబాద్ వరకు ఎడమకాల్వను తవ్వాల్సి ఉండగా, 3 ప్యాకేజీలుగా విభజించి రూ.1,469 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లను కూడా పిలిచారు. కురుమూర్తిరాయ రిజర్వాయర్ నుంచి 103 కిలోమీటర్ల పొడవుతో హై లెవల్ ప్రధాన కాల్వను తవ్వాల్సి ఉండగా, దానికింద మొత్తంగా 1.51 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఆ పనులకు సైతం టెండర్లను ఖరారు చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ టెండర్లన్నింటినీ రద్దు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం.

చిన్న ప్రాజెక్టులపైనే దృష్టి

కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టుల నిర్మాణంపై కంటే చిన్న ప్రాజెక్టులు, మైనర్ ఇరిగేషన్, ఐడీసీ లిఫ్ట్‌లపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నట్టు తెలుస్తున్నది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆయకట్టుకు నీరందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నది. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే ఇదే విషయాన్ని అధికారులకు ప్రత్యేకంగా నొక్కిచెప్పారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆయకట్టుకు నీరివ్వగలిగే ప్రాజెక్టులు ఏమున్నాయి? 6 నెలలు, సంవత్సరం, రెండేండ్లలో పూర్తి చేయగలిగే ప్రాజెక్టులు ఏవి? ప్రస్తుతం ఆయా ప్రాజెక్టుల పురోగతి, అందులో ఎదురవుతున్న సవాళ్లు ఏమిటి? కావాల్సిన నిధులు తదితర అంశాలపై పూర్తిస్థాయి నివేదికను తయారు చేయాలని ఆదేశించారు. నేడు నిర్వహించనున్న సమావేశంలో ఆయా అంశాలపైన కూడా సమీక్షించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుత సీజన్‌లో ప్రాజెక్టుల ద్వారా సాగునీటి విడుదల, ఆయకట్టు అంశాలపైన కూడా సీఎం రేవంత్ సమీక్షించనున్నట్టు అధికారులు వెల్లడించారు. తొలుత ఆయా అంశాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇరిగేషన్ అధికారులతో అన్ని అంశాలపై సమీక్షించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహిస్తారు.

బీసీబంధు బంద్

- కులవృత్తులకు రూ.లక్ష సాయం పథకం నిలుపుదల
- అధికారులకు మంత్రి పొన్నం స్పష్టమైన ఆదేశాలు
- జూలైలో పథకాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ సర్కారు
- తొలివిడతలో 40 వేల మందికి రూ.లక్ష చొప్పున అందజేత
- ఇంకా జాబితాలో 3.60 లక్షల మంది అర్హులు

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): వెనకబడిన వర్గాల కులవృత్తులు, చేతివృత్తిదారులకు ముడిసరుకులు, యంత్రపరికరాల కొనుగోలుకు 100 శాతం సబ్సిడీతో రూ.1 లక్ష ఆర్థికసాయం అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీబంధు పథకాన్ని నిలుపుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బీసీబంధు పథకం కింద ఎలాంటి చెల్లింపులు చేయకూడదని ఆదేశించారు. రాష్ట్రంలోని బీసీ కులవృత్తిదారులు, చేతివృత్తుల బలోపేతానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1 లక్ష ఆర్థిక సాయం పథకాన్ని అమలు చేసింది. పనిముట్ల కొనుగోలు, లేదంటే ఆధునీకరణ, ముడిసరుకుల కొనుగోలుకు మాత్రమే ఆర్థిక సాయం అందివ్వాలని నిర్ణయించింది. అందుకోసం దరఖాస్తులను స్వీకరించగా, 5,28,862 మంది దరఖాస్తు చేసుకొన్నారు. బీసీ ఏ సామాజికవర్గం నుంచి 2,66,001, బీసీ బీ నుంచి 1,85,136, బీసీ డీ నుంచి 65,310, ఎంబీసీల నుంచి 12,415 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల పరిశీలన అనంతరం 4.13 లక్షల మందికిపైగా అర్హులను గుర్తించారు. వారందరికీ ప్రతి నెలా 15వ తేదీన ఆర్థికసాయం అందించాలని, అది నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతను జూలై 15వ తేదీన లాంఛనంగా ప్రారంభించింది. ఎన్నికల ముందు వరకు దాదాపు 40 వేల మందికి బీసీబంధు అందించింది. ఇంకా 3.60 లక్షల మంది అర్హులున్నారు. తాజాగా ఆ పథకాన్నే నిలుపుదల చేయాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించింది.

తగ్గుతున్న కేంద్ర 'ఉపకారం'!

- 50% పడిపోయిన ఎస్సీ లబ్ధిదారులు
- ఎస్టీ విద్యార్థులదీ అదే పరిస్థితి
- బడ్జెట్‌కు కోత విధిస్తున్న కేంద్రం

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : పాఠశాల విద్యార్థులను ఉన్నత చదువుల్లో ప్రోత్సహించేందుకు అందజేసే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్స్ (ఎన్ఎంఎంఎస్) లబ్ధిదారుల్లో ఏటా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తగ్గుతున్నారు. అణగారిన వర్గాల ప్రతిభావంతులకిచ్చే ఈ స్కాలర్‌షిప్‌ల లబ్ధిదారుల్లో ఈ సామాజికవర్గాల విద్యార్థుల సంఖ్య పడిపోతున్నది. 2018 -19 విద్యాసంవత్సరంతో పోల్చితే 2022 -23లో ఎస్సీ లబ్ధిదారులు 50శాతానికి పైగా తగ్గారు. ఇక ఎస్టీలు 2019-20 సంవత్సరంతో పోల్చితే 60శాతానికి పైగా తగ్గిపోయారు. నిరుపేద ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు, డ్రాపౌట్లను తగ్గించేందుకు కేంద్ర విద్యాశాఖ ఈ స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నది. 9వ తరగతితో ప్రతిభాపరీక్షలో ఎంపికైన విద్యార్థులకు 10, 11, 12 తరగతుల్లో ప్రతి ఏటా రూ.12వేల స్కాలర్‌షిప్‌ను అందిస్తారు. లక్షలాది మంది విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్‌లను అందజేయనుండగా, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

ఎన్ఎంఎంఎస్ ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల వివరాలు

సంవత్సరం	ఎస్టీ లబ్ధిదారులు	ఎస్సీ లబ్ధిదారులు
2018-19	12,186	59,314
2019-20	27,495	60,438
2020-21	22,562	58,307
2021-22	16,460	48,116
2022-23	10,879	27,785

బడ్జెట్ కేటాయింపులు - వాస్తవిక ఖర్చులిలా (రూ.కోట్లల్లో)

సంవత్సరం	ఎస్టీ విద్యార్థులకు	
	కేటాయింపు	ఖర్చు
2018-19	32.07	13.82
2019-20	34.90	31.71
2020-21	30.50	26.80
2021-22	10.50	19.75
2022-23	16.00	11.94

- ఎస్సీలకు కేటాయించిన బడ్జెట్ ఖర్చులు పరిశీలిస్తే 2010-20, 2020-21, 2021-22 విద్యాసంవత్సరాల్లో ఎక్కువగా ఖర్చుచేశారు.
- 2018-19లో రూ.59.95 కోట్లకు రూ.54.10 కోట్లే ఖర్చుచేసి సుమారుగా రూ.5కోట్లకు కోత విధించారు.
- 2022- 23లో రూ. 51 కోట్లు కేటాయించి, రూ. 32.50 కోట్లే ఖర్చుచేశారు. దీంతో లబ్ధిదారుల సంఖ్య సగానికి పడిపోయింది.

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

నేవీలో 10+2 (బీటెక్ స్కీమ్)

ఇండియన్ నేవీలో 10+2 (బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీం కింద ప్రవేశాలకు ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 35
  10+2 (బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీం (పర్మినెంట్ కమిషన్)
- **బ్రాంచీలు:** ఎగ్జిక్యూటివ్, టెక్నికల్
- **అర్హతలు:** కనీసం 70 శాతం మార్కులతో ఇంటర్ (ఎంపీసీ) ఉత్తీర్ణతతో పాటు జేఈఈ (మెయిన్)లో ర్యాంకు సాధించి ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- **ఎంపిక:** జేఈఈ మెయిన్ ర్యాంకు, పరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టు ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరి తేదీ:** జనవరి 20
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

జేఎన్‌టీయూలో పార్ట్ టైం ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూహెచ్)లో పార్ట్ టైం పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు ప్రకటన విడుదలైంది.

- **ప్రోగ్రామ్స్:** ఎంటెక్ (ఎలక్ట్రికల్ పవర్ ఇంజినీరింగ్, ఇంజినీరింగ్ డిజైన్, థర్మల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ తదితరాలు), ఎంబీఏ (హెచ్ఆర్ ఫైనాన్స్ తదితరాలు)
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 20
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- బయాలజీ (గ్రూప్స్), మెథడాలజీ (డీఎస్సీ), ఇంగ్లిష్ గ్రామర్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.